క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. రెడ్డి కాలనీ, గుడిబండల్, రాయపుర, రోజరీ స్కూల్ ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మసీదులో ఇఫ్తార్ విందు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కుమార్‌పల్లి మార్కెట్ ఎదురుగా ఉన్న మర్కజీ మసీదులో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ముస్లిం మతపెద్దలతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

డీజిల్ లోకోషెడ్‌లో వైద్య శిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో కాజీపేట రైల్వే డీజిల్‌కాలనీ హెల్త్ యూనిట్ డీఎంఓ డాక్టర్ ధీరజ్‌కుమార్, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ నరేందర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ మమత, ఆర్థో డాక్టర్ ఉత్తమ్‌కుమార్, ఫిజీషియన్ డాక్టర్ హేమలత, వైద్య సిబ్బంది ప్రసాద్, కవిత, సోని, థామస్, గోపికాంత్ పాల్గొని కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది శ్రీనివాస్, ముకేష్, జయశీల, పుష్పవతి, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు పి.వేదప్రకాష్, ఎస్‌కె.జానీమియా, గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, తిరుపతి, యాదగిరి, రైల్వే సంఘ్ నాయకులు జగదీశ్వర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలలో మరణించిన ముచ్చర్లకు చెందిన మట్టెడ సబిత అంత్యక్రియలకు బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఈమేరకు రూ.3వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. తొలుత మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు ప్రమోద్, శ్రీధర్, రాజేష్, సతీష్‌చారి, కర్ణాకర్, శ్రవణ్, ఐలయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



రామన్నపేట: నగరంలోని ఎల్‌బీ కళాశాలలో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో బాస్కెట్ బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ (పురుషులు, మహిళల) పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నిరంజన్, సెక్రటరీ ఈ.రాజేందర్, ట్రెజరర్ ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేందర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రభాకర్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సత్యనారాయణ, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేయూ లైబ్రరీలో తాగునీటి సమస్య



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని లైబ్రరీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీలోని ఫ్రిజ్‌లో నీరు అందుబాటులో ఉండడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదీప్, శ్రీకాంత్, సందీప్, సాయికుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన హెచ్ఎం, ఉపాధ్యాయులను ఆదుకోవాలి

కాశోజీ సెంటర్ : ఏసీబీ అధికారులు సాక్షులుగా తమ వెంట తీసుకెళ్లిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారని పీఆర్‌టీయూ నాయకులు పేర్కొన్నారు. జి.భిక్షపతి కోమాలోకి వెళ్లగా, మరొకరు కృష్ణమూర్తి కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారు పేర్కొన్నారు. గాయపడిన ఇద్దరు ఉపాధ్యాయులను ఆదుకోవాలని పీఆర్‌టీయూ నాయకులు డీఈఓ వాసంతికి వినతిపత్రం అందజేశారు.

మోక్షమెప్పుడో?

- రూ.120 కోట్ల అభివృద్ధి పనులకు గతంలో భూమిపూజ
- ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేసి వదిలేసిన వైనం
- అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో బ్రేక్
- జీఓ రద్దు.. పనులు నిలిపివేత



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్ (ఫైల్)



అప్పటి ఎమ్మెల్యే ఆవిష్కరించిన శిలాఫలకం

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలో శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు గతేడాది సెప్టెంబర్ – అక్టోబర్ నెలలో వర్ధన్నపేట నియోజకవర్గంలో రూ.120 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.50కోట్లు ఆర్‌అండ్‌బీ ద్వారా, రూ.10కోట్లు, హృదయ్ పథకం కింద రూ.20కోట్లు, రూ.40కోట్లు స్మార్ట్ సిటీ నిధులు మంజూరు చేయించారు. బీటీ, సీసీ రోడ్లతో పాటు మురుగునీటి కాలువలు, తాగునీరుకు నిధులు కేటాయించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కనీసం రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు నుంచి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కుల సంఘాలకు కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపన కూడా చేశారు. ఒక్కో శిలఫలకం ఏర్పాటుకు రూ.10వేలు నుంచి రూ.20వేల వరకు ఖర్చు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నిబంధనలు అమలులోకి రావడంతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. ఎన్నికల తర్వాత పనులు ప్రారంభమవుతాయని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతూవచ్చారు.

ఆరు నెలలు గడుస్తున్నా..

ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ శంకుస్థాపన చేసిన పనులు ఇప్పటివరకూ ప్రారంభం కాలేదు. ప్రభుత్వం మారడంతో పనుల ప్రారంభం కొంత ఆలస్యం కావొచ్చని ప్రజలు భావిస్తూ వచ్చారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు విడుదల చేస్తూ అప్పటి ప్రభుత్వం జారీచేసిన జీఓను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని అధికారులు తెలిపారు. గతంలో శంకుస్థాపన చేసిన పనులు పూర్తిగా నిలిపోయాయని వివరించారు. కుడా, స్మార్ట్‌సిటీ, ఆర్‌అండ్‌బీ నిధుల ద్వారా మంజూరైన పనులు కూడా ఇప్పటివరకు ప్రారంభం కాలేదు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సామూహిక సీమంతం నిర్వహిస్తున్న కలెక్టర్



కాజీపేట: సదస్సులో వైద్యులు, నిర్వాహకులు

కాజీపేట అర్బన్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా హనుమకొండ లష్కర్‌బజార్‌లోని శిశుగృహ, కళాశాల ఎట్ హోమ్ ప్రాంగణంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని సామూహిక సీమంతాలు, అన్నప్రసన చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా సంక్షేమాధికారి మధురిమ తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ్‌పై అవగాహన సదస్సు

కాజీపేట: కాజీపేట భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పోషణ్ పక్వాడ్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఏరియా జనరల్ మేనేజర్ సుమ్మీత్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన పలు రకాల వంటకాల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయని వివరించారు. ఏజీఎం ధీరజ్‌కుమార్, సునీల్, రవికుమార్, సురేష్, వంశీ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌ఖాన్‌కు చైర్మన్ పదవి ఇవ్వాలి



వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్‌కు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ కోరారు. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, ఒలింపిక్స్ సంఘం కార్యవర్గ సభ్యులు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కైలాస్‌యాదవ్ మాట్లాడుతూ జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడిగా, రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా అటు క్రీడాకారులకు, ఇటు ప్రజలకు సేవలందించిన క్రీడా పోషకుడు అజీజ్‌ఖాన్ అని తెలిపారు. క్రీడాకారుల అభ్యున్నతికి పాటుపడే జంగా రాఘవరెడ్డి, ఇనుగాల వెంకట్రాంరెడ్డికి నామినేటెడ్ పదవులు కేటాయించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ ఒలింపిక్స్ సంఘం బాధ్యులు తోట శ్యాంప్రసాద్, శ్యామల పవన్, ఆకుల సారంగపాణి, సాంబశివరావు, తాబేటి రాజేందర్, బిన్ని లక్ష్మణ్, లిల్లీ ఫ్లోరెన్స్, సూర్యారావు, చందర్, రాజయ్య, సృజన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కారు – బైక్ ఢీ

హసన్‌పర్తి: కారు – బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారి మార్గమధ్యలోని బావుపేట క్రాస్ వద్ద శుక్రవారం ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కమలాపూర్‌కు చెందిన వత్తిపాక శ్రీధర్ ద్విచక్ర వాహనంపై ఎల్లాపురం నుంచి కమలాపూర్ వైపు బయలుదేరాడు. బావుపేట క్రాస్ వద్ద కారు – బైక్‌ను ఢీకొట్టడంతో శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీధర్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

పెద్దపేగు క్యాన్సర్‌పై అవగాహన

హన్మకొండ చౌరస్తా: పెద్దపేగు క్యాన్సర్ (కోలన్ క్యాన్సర్)పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కూరపాటి ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ కూరపాటి రమేష్ సూచించారు. కోలోరెక్టల్ క్యాన్సర్‌పై అవగాహన మాసోత్సవాల్లో భాగంగా హనుమకొండ కుడా కార్యాలయం రోడ్డులోని కూరపాటి ఆస్పత్రిలో వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం కోలన్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు చైతన్య రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో పెద్దపేగు క్యాన్సర్ మహమ్మారిలా వ్యాప్తి చెందిందన్నారు. డాక్టర్ రాధిక మాట్లాడుతూ మహిళల్లో సైతం ఇలాంటి సమస్యలు ఉన్నప్పటికీ సిగ్గు, బిడియంతో వైద్యులను సంప్రదించడం లేదన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

ఖిలా వరంగల్: మూత్రపిండాల సమస్యలు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని డాక్టర్ పొన్న అరుణ్ కుమార్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని పల్లవి ఆస్పత్రిలో యశోద ఆస్పత్రి సోమాజిగూడ ఆధ్వర్యంలో డాక్టర్ పొన్న దశరథం నేతృత్వంలో డాక్టర్ రవీందర్ సహకారంతో మూత్రపిండాల సమస్యల నిర్ధారణ, రక్త పరీక్షలు, కిడ్నీ ఫక్షనింగ్‌పై శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి సమస్య తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ జాఫర్, ఆడెపు ప్రసాద్, నాగరాణి, చాందిని, జగదీశ్వర్ శ్యామల, సరోజ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ వైద్యుల’పై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ ప్రతినిధులు

ఖిలా వరంగల్: ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ ప్రభుత్వ వైద్యులుగా చెలమణి అవుతూ ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుతున్న వైద్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి డి.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులో రాష్ట్ర వైద్య మండలి సభ్యుడు, పబ్లిక్ రిలేషన్ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ కాకతీయ మెడికల్ కళాశాల ఆస్పత్రి, ఎంజీఎంలో పనిచేస్తున్న వైద్యులు లక్షలాది రూపాయల జీతాలు తీసుకొని పేదలకు సరైన సేవలు అందించటం లేదని విమర్శించారు. పనిచేసే సమయంలో ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్యం పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. జిల్లా వైద్య అధికారులు, సూపరింటెండెంట్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యూటీలో ఉండాలని ప్రభుత్వం జీఓ జారీ చేసినా అవేమీ పట్టనట్లుగా వారు వ్యవహరిస్తున్నారని ఎద్దేవాచేశారు. పలివేల్పుల గ్రామానికి చెందిన పసునూరి దేవేందర్ మృతికి కారణమైన కేఎంసీ యూరాలజీ డాక్టర్ రణధీర్‌రెడ్డిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు. డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

‘ఆటో బతుకులు’ సీరియల్‌ను ఆదరించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, డ్రైవర్లు

కాశిబుగ్గ: ఆటో డ్రైవర్ల పరిస్థితి, వారి జీవితాల ఆధారంగా రూపొందించిన ‘ఆటో బతుకులు’ సీరియల్‌ను ఆదరించాలని సీరియల్ హీరో మంద రవికుమార్ పిలుపునిచ్చారు. హీరో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఓసిటీలో సీరియల్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల పరిస్థితి బాగాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.వేయి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేల చొప్పున ఆటో బంద్ పథకం కింద ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దార సూరి, అక్కినపెల్లి అంజయ్య, మహేందర్, నవీన్‌కుమార్, కరుణాకర్, ప్రశాంత్, రమేష్, వెంకటేష్, అంజి, ఆసిఫ్, శివ, నర్సయ్య, సీరియల్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభాకర్

ఖిలా వరంగల్: మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ నేత కరాటే ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆదేశాల మేరకు వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ నేత చిట్టిమల్ల శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షురాలు పొనకంచి కృష్ణకుమారి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మహిళా కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పంచరాణి సంతోషి, బాశెట్టి వెంకటేశ్వర్లు, శెట్టి రాజేష్, పద్మ, మాధవి, కోతి స్వరూప, బేతి ఉమామహేశ్వరి, పసునూరి ప్రేమలత, గర్నెపల్లి స్వప్న, ఇంజమూరి కల్పన, కవిత, పూర్ణిమ, లత, లక్ష్మి, రమ, మంజుల, పద్మ, అనిత, వరలక్ష్మి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



విగ్రహాలకు చక్రస్నానం చేయిస్తున్న పండితులు

కాజీపేట: చైతన్యపురి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆరురోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు పద్మావతి, గోదాదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాలను వేదపండితులు ఊరేగింపుగా తీసుకెళ్లి నదీజలాలతో చక్రస్నానం చేయించారు. సప్త బావులు, సప్త నది జలాలతో ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేయించారు. భక్తుల కోలాహలం మధ్య ఉత్సవమూర్తులతో పండితులు నృత్యాలు చేశారు. వేద పండితులు డాక్టర్ శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో వారం రోజులుగా సాగుతున్న గణపతి హోమానికి పండితులు, భక్తులతో కలిసి కనులపండువగా పూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తిచేసిన పండితులు, బ్రాహ్మణోత్తములు, సన్నాయి మేళ కళాకారులను దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డేపల్లి నరేందర్ సన్మానించారు. ఉత్సవాల్లో తిరునగరి దిలీప్ కుమార్, ఐలోని వెంకట మల్లారెడ్డి, పెద్ది అశోక్‌కుమార్, రాచర్ల శంకరయ్య, వంగాల సత్యనారాయణ రెడ్డి, శనిగరపు సుజాత పాల్గొన్నారు.

చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



న్యూశాయంపేట: సమాచార హక్కు రక్షణ చట్టానికి కమిషనర్‌ను నియమించాలని, చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని రక్షణ చట్టం ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యులు కోరారు. ఈమేరకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం సమాచార హక్కు రక్షణ చట్టం డైరీని మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెట్టబోయిన విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అమీర్‌ఖాన్, భూక్య లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



హన్మకొండ చౌరస్తా: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు



హసన్‌పర్తి: నీటి బొట్టు ఆకారంలో విద్యార్థులు

హన్మకొండ చౌరస్తా: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన ‘పర్యావరణ చైతన్య’ కరపత్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. హనుమకొండ పర్యావరణ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జల దినోత్సవంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ బాధ్యులు వడ్డెపెల్లి చెరువు కట్టపై వాకర్లకు, బాలసముద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నీటి కాలుష్యం, నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జల ప్రతిజ్ఞ చేయించారు. పవన్, పురుషోత్తం, శ్రవణ్, రాజ్‌కుమార్, శ్యాంసుందర్, రవిబాబు, శ్రీనివాస్, దామోదర్, లక్ష్మణ్, స్వరూప పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

హసన్‌పర్తి: ప్రపంచ జల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు వినూత్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుతోట రాంబాబు మాట్లాడుతూ సకల చరాచర జీవకోటికి నీరు ప్రాణధారం అన్నారు. నీరులేక జీవకోటి మనుగడ లేదని వివరించారు. ఈక్రమంలో ప్రతీనీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల పరిశీలన



ఆలయ భూములను పరిశీలిస్తున్న అధికారులు

మడికొండ: మడికొండలోని వేణుగోపాల స్వామి ఆలయ భూములను దేవదాయ శాఖ అధికారులు శుక్రవారం సందర్శించారు. ఆలయానికి సంబంధించిన 9ఎకరాల భూముల హద్దులను పరిశీలించారు. భూమిని చదును చేసిన అనంతరం వారం, పది రోజుల్లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు ఏసీ, ఎంఆర్‌ఓ సునీత, వరంగల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి, వేయి స్తంభాల ఆలయం ఈఓ వెంకటయ్య, దుర్గేశ్వరస్వామి ఆలయ ఈఓ ప్రసాద్, స్థానిక మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు దువ్వ శ్రీకాంత్, నిగ్గుల సతీష్, బజ్జూరి శ్రీనివాస్, ఉపేంద్రచారి, బొల్లికొండ వినోద్, కుమార్‌బాబు, దువ్వ నవీన్, పొనగోటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

హన్మకొండ కల్చరల్: దేవాదాయ శాఖ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రకాళి దేవస్థాన ఈఓ శేషభారతి హెచ్చరించారు. సీతారామచంద్ర స్వామి దేవస్థానం భూములను ఆక్రమిస్తే ఊరుకోబోమని అన్నారు. సర్వే నంబర్ 809లో అక్రమంగా నిర్మించిన ప్రహరీని దేవాదాయ శాఖ అధికారులు తొలగించారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపేంద్రశర్మ, తదితరులు

హన్మకొండ కల్చరల్: హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, తదితరులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ 5,627 మందికి గ్రాంటినెయిడ్ ద్వారా వేతనాలు రావాల్సి ఉండగా, కేవలం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో 3వేల మందికి మాత్రమే వేతనాలు అందుతున్నాయని తెలిపారు. కారుణ్య నియామకాలను పూర్తి చేయాలని కోరారు. కృష్ణమాచారి, పరాశరం, రవీంద్రచారి, అర్చక జేఏసీ కన్వీనర్ అగ్నిహోత్రం, చంద్రశేఖర్ శర్మ, అంబ ప్రసాద్‌శర్మ, సంతోష్ కుమారాచార్యులు, బండారి జగపతి, పెన్నా మోహన్‌శర్మ పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

న్యూశాయంపేట: కార్మికుల హక్కుల కోసం పోరాడాలని, మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కృషిచేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కమిటీ అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన శుక్రవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కుల కోసం ఉద్యమించాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ రాజ్యాంగాన్ని తీసుకురావాలని చూస్తోందని విమర్శించారు. సమావేశంలో నాయకులు రాజుగౌడ్, రాజమౌళి, రామమూర్తి, రాజేందర్, అశోక్, లక్ష్మణ్, సదానందం, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేష్

వరంగల్: గుట్కా, గంజాయి, డ్రగ్స్‌లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటుపడి యువకులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ అన్నారు. ఏనుమాముల సుందరయ్యనగర్‌లో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్య వివాహాలు, సీసీ కెమెరాలు, గుట్కా, గంజాయి, డ్రగ్స్‌పై స్థానికులకు, యువకులకు శుక్రవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మూఢ నమ్మకాలపై మ్యాజిక్ షో, వృద్ధ తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని, తదితర అంశాలపై పాటల ద్వారా, సైబర్ క్రైమ్స్ నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. 1930 సైబర్ టోల్ నంబర్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు పోగుల శ్రీకాంత్, నర్సింహారావు, పోలీసు సిబ్బందితో పాటు కళాబృందం ఇన్‌చార్జ్ ఏఎస్సై నాగమణి, కళాబృందం సభ్యులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రంరాజ్, చిరంజీవి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

న్యాయవాదికి పరామర్శ

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలలో మృతిచెందిన హసన్‌పర్తికి చెందిన అప్పాల యాదగిరి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం సందర్శించి నివాళులర్పించి మృతుడి కుమారుడు న్యాయవాది నరసింహారాములును పరామర్శించారు. పరామర్శించిన వారిలో కార్పొరేటర్ శివకుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.